పట్టణ ప్రగతికి 'పన్ను' దన్ను

- మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో పెరుగుతున్న పన్నుల ఆదాయం
- అభివృద్ధిలో సింహ భాగం ఈ నిధులదే
- ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్న సిబ్బంది
- పన్ను చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు గడువు
- లక్ష్యం చేరుకునేందుకు కసరత్తు చేస్తున్న అధికారులు


నార్సింగి మున్సిపాలిటీలోని నివాసాలు


మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నివాసాలు

మణికొండ: పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిధుల లభ్యత ఉండాలి. మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు తక్కువగానే ఉంటాయి. మున్సిపాలిటీల పరిధిలోకి వచ్చే ఇంటి పన్ను ఆదాయమే అగ్రభాగంలో నిలుస్తుంది. ఆ నిధులతోనే అత్యధిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ప్రతి సంవత్సరం నివాసాలు పెరిగిపోతుండడంతో ఆదాయం సైతం పెరుగుతోంది. మణికొండ మున్సిపాలిటీ ఏర్పడినపుడు 2020–21 సంవత్సరంలో 26,832 గృహాలు ఉండగా వాటి నుంచి పన్నుల రూపంలో రూ.27.92 కోట్లు వచ్చేది. 2021–22 సంవత్సరానికి 34,480 నివాసాలతో పన్నుల ఆదాయం రూ.36.96 కోట్లకు చేరుకుంది. 2022–23 ప్రస్తుత సంవత్సరంలో 38,882 నివాసాలతో పన్నుల వసూళ్లు రూ.45.28 కోట్లకు చేరుకుంది.

పన్నుల వసూళ్లు ఇలా..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 2020–21 సంవత్సరానికి 9.89 కోట్లకు గాను 7.32 కోట్ల పన్ను వసూలైంది. 2021–22 సంవత్సరానికి రూ.17 కోట్లకు గాను రూ.14.60 కోట్లు, ఈ సంవత్సరం రూ.27 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.16 కోట్ల మేర పన్నులు వసూళ్లయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 2020–21 సంవత్సరానికి రూ.27.92 కోట్లకు గాను రూ.19.55 కోట్లు, 2021–22 సంవత్సరానికి రూ.36.96 కోట్లకు గాను రూ.30.19 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఈ సంవత్సరానికి రూ.45.28 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.30 కోట్లు వసూళ్లయ్యాయి.


గేటెడ్ కమ్యూనిటీలో పన్ను వసూలు చేస్తున్న మణికొండ అధికారులు

ఈ నెలలో పెరగనున్న వసూళ్లు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీతో సమయం ముగియనుంది. దీంతో జంట మున్సిపాలిటీల్లో సిబ్బంది, అధికారులు ప్రతి కాలనీ, గేటెడ్ కమ్యూనిటీలకు వెళ్లి వెంటనే పన్ను చెల్లించాలని కోరుతున్నారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. ప్రతి త్రైమాసికానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకపోతే పెనాల్టీ విధిస్తున్నారు. ఏప్రిల్ నెలలో మొత్తం సంవత్సరం పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తున్నారు. రాయితీలను సద్వినియోగం చేసుకునే వారు కొందరు ఉంటే అత్యధికులు మాత్రం మార్చి నెలలోనే చెల్లించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ నెలాఖరు వరకు మున్సిపాలిటీలకు కోట్లాది రూపాయల పన్ను ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

సకాలంలో పన్ను చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యం



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లకు ఎప్పటికప్పుడు పన్ను విధిస్తుండడంతో మున్సిపాలిటీ ఆదాయం మూడు రెట్లు పెరిగింది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసేందుకు సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారు. ఇప్పటి వరకు 76 శాతం మేర వసూలైంది. ఈ నెలాఖరు వరకు 95 శాతం వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సకాలంలో పన్ను చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని ప్రజలు గమనించాలి.

– వి.సత్యబాబు, నార్సింగి మున్సిపల్ కమిషనర్

పన్నులతోనే ప్రగతి



మున్సిపాలిటీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలంటే గృహాలు, వ్యాపార సముదాయాలకు విధించే పన్నులు సరైన సమయంలో చెల్లించాలి. ప్రజలు సహకరించి పన్నులు చెల్లిస్తే నిధుల లభ్యత పెరుగుతుంది. తద్వారా వేగంగా ప్రగతి సాధించవచ్చు. ఇదే విషయాన్ని గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తున్నాం. ఇప్పటి వరకు 70 శాతం వసూళ్లు అయ్యాయి. ఈ నెలాఖరు వరకు 95 శాతానికి పైగా వసూళ్లే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. – కె.ఫల్గుణ్‌కుమార్, మణికొండ మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

నేడు హనుమాన్ ఆలయాల్లో ప్రతిష్ఠాపన వేడుకలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని క్వార్టర్స్‌లో వీరాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మైహోం టవర్స్ పక్కన ఉన్న సంకటహర హనుమాన్ దేవాలయం ఆవరణలో నవగ్రహాల ప్రతిష్ఠాపన శనివారం ఉదయం 8.32 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయా దేవాలయాల అర్చకులు తెలిపారు. గత రెండు రోజులుగా ఆలయాల ఆవరణలో ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ప్రతిష్ఠాపనలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీల నాయకులు కోరారు. సంకటహర హనుమాన్ దేవాలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరవుతారని కమిటీ నాయకులు తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు రుణ పత్రాలు అందజేత


రుణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ తన్వీరాజు

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ, రాయన్నగూడ గ్రామాల్లోని మహిళా పొదుపు సంఘాలకు మంజూరైన బ్యాంకు రుణాలను శుక్రవారం జెడ్పీటీసీ తన్వీరాజు పంపిణీ చేశారు. నర్కూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు సంఘాలకు రూ.20లక్షల చొప్పున రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ప్రతి ఏటా మాదిరిగా ఈ సంవత్సరం వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు తీర్మాణం చేశారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే మహనీయుల జయంతి వేడుకలు జయప్రదం చేసేందుకు నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా పలుగుచెరువు మహేష్, ప్రధాన కార్యదర్శిగా బట్టు శ్రీనివాస్, కోశాధికారిగా మంగళారం శ్రీనివాస్, సంయుక్త కోశాధికారిగా ఏ.సూర్యం, ఉపాధ్యక్షులుగా నాటి ధనుంజయ, పచ్చ నర్సింగ్‌రావు, నందిగామ నర్సింహ, రగడపల్లి శ్రావణ్, దాసరి రమేష్, నాగని సురేష్, జోగి శ్రీనివాస్, వీర్లపల్లి మహేష్ తదితరులు నియమితులయ్యారు.

మనూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సహకారంతో మార్చి 13 నుంచి 19వ తేదీ వరకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మహ్మద్ యూసుఫ్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ కేవలం బీఈడీ, ఎంఈడీ పాసైన విద్యార్థులకు(దూర విద్య విధానం) మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

హెచ్‌సీయూలో ముగిసిన రెండు రోజుల సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జే.రాణి రత్నప్రభ రచించిన 'భారత దేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు, సవాళ్లు' అనే పుస్తకాన్ని నోయిడా వీవీగిరి లేబర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ అమిత్‌నిర్మల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. హెచ్‌సీయూ వీసీ ప్రొ. ఆర్‌ఎస్ సర్రాజు, సీఎస్ఎస్ఈఐపీ వ్యవస్థాపకుడు సుధాకర్ రావు, మాజీ వీసీ ప్రొ. రాజశేఖర్, ప్రొఫెసర్లు ఆశీమ్‌ప్రకాశ్, శ్రీపతిరాయుడు, రాజమోహన్ రావు, నాగరాజు పాల్గొన్నారు.

ఉర్దూ అందమైన, సున్నితమైన భాష

ప్రొఫెసర్ పెగ్గీమోహన్



రాయదుర్గం: ఉర్దూ చారిత్రాత్మక భారతీయ భాష అని హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలో మనూ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉర్దూ స్థానిక సంస్కృతిని కలిగి ఉంటుందని, ఇది అందమైన, సున్నితమైన భాష అని పేర్కొన్నారు. వివిధ పేర్లతో పిలిచే కాలంలో ఉర్దూ ఎలా పరిణామం చెందిందో వివరించారు. ఉర్దూలో ఉజ్బెక్ భాష ప్రభావం ఉందని ఆమె అన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ.. ఏ భాషలోనైనా స్థానిక సంస్కృతి చాలా బలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రొఫెసర్ పెగ్గీమోహన్ ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో దక్కన్ కల్చర్, హెరిటేజ్ నిష్ణాతులు సజ్జద్‌షాహిద్, ప్రొఫెసర్ నసీముద్దీన్ ఫరీస్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్ తదితరులు ప్రసంగించారు.

సవాళ్లను అధిగమిస్తే విజయాలు మన సొంతం

శంషాబాద్: 'జీవితంలో అడుగడుగునా సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయి.. వాటిని అధిగమించేందుకు మీరు చేసే పోరాటాలే విజయాలను మీకు మోకరిల్లేలా చేస్తాయి' అని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు విద్యార్థులతో అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్‌బీఎల్ బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వంద మంది విద్యార్థినులకు సైకిళ్లతో పాటు ప్రత్యేక కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. బాలికలు తప్పనిసరిగా ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. సమస్యలకు వెరవకుండా ధైర్యంతో ముందుకెళ్తేనే లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. ప్రైవేట్ సంస్థలు అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆర్‌బీఎల్ సంస్థ విద్యార్థినులకు వంద సైకిళ్లను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఎంఈఓ రాంరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సైకిళ్లు అందజేసిన ఆర్‌బీఎల్ ప్రతినిధులు

ఏకగ్రీవం కానున్న ఆల్‌కాలనీస్ అసోసియేషన్ ఎన్నిక


నామినేషన్లు దాఖలు చేస్తున్న పలు కాలనీల ప్రతినిధులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఫెడరేషన్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల సమయం ముగిసింది. ఫెడరేషన్‌లో మొత్తం 21 పదవులకు గాను శుక్రవారం సాయంత్రం వరకు 20 నామినేషన్లు వచ్చాయి. కార్యనిర్వాహక కార్యదర్శి(మహిళ) స్థానానికి నామినేషన్ దాఖలు కాలేదు. మిగతా పదవులు ఉన్నంత వరకే నామినేషన్లు రావడంతో గతంలో ఉన్న అధ్యక్షుడు డి.సీతారాంతో పాటు ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు నేతృత్వంలోనే కొత్త కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నిక కానుంది. శనివారం నామినేషన్ల ఉపసంహరణ, ఆదివారం ఉదయం 10 గంటలకు హుడా కాలనీ కమ్యూనిటీహాల్‌లో సర్వసభ్య సమావేశం, కమిటీ ఎన్నిక ప్రక్రియను నిర్వహించనున్నారు.

అంబేడ్కర్ సేవల గురించి యువతకు వివరించాలి

రాజేంద్రనగర్: పేదల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలను నేటితరం యువతకు వివరించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నేతాజీనగర్ స్కూల్‌లోని మైదానంలో అంబేడ్కర్ జీవిత చరిత్రను నాటకం రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాన్‌వెస్లీ హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, దాని అనుబంధ సంస్థలు ప్రజలపై దాడులు చేస్తున్నాయన్నారు. కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జి.ఎం.గట్టయ్య, జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి బి.శామ్యూల్, ప్రకాష్, సీపీఎం మండల కార్యదర్శి జి.ఎం.కురుమయ్య, బీఆర్ఎస్ నాయకులు పి.సుధాకర్‌గౌడ్, గట్టయ్య, కే.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


నాటక ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

విరుచుకుపడుతున్న వీధి కుక్కలు

- బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో తీవ్రంగా కుక్కల బెడద
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


కుక్కలను యానిమల్ కేర్ సెంటర్‌కు తరలిస్తున్న దృశ్యం

బండ్లగూడ: రోజు రోజుకు కుక్కల దాడి ఘటనలు పెరుగుతున్నాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్య అధికంగా ఉంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. ప్రజలు ఒంటరిగా కనిపిస్తే కుక్కలు దాడి చేయకుండా వదిలిపెట్టడం లేదు. రోడ్లపై వెళ్లే ద్విచక్ర వాహనాలు, కార్ల వెంట పడి వీధి కుక్కలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, వాటిని తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కుక్క దాడిలో గాయపడిన వ్యక్తి

వ్యక్తిపై దాడి..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ కాళికానగర్‌లో ఓ వ్యక్తిపై వీధి కుక్క దాడి చేసింది. కాళికానగర్ నుంచి రోడ్డుపై ఉన్న లేబర్ అడ్డాకు వెళ్తున్న అతడిని వీధి కుక్క గాయపరిచింది. ఎడమ కాలిపై కరవడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కుక్కలను పట్టుకునేందుకు సిబ్బంది..

వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ బుర్రా సాగర్‌గౌడ్ వెల్లడించారు. శుక్రవారం కాళికానగర్‌లో ఓ వ్యక్తిపై దాడి చేసిన కుక్కను యానిమల్ కేర్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. ఆ కుక్క గత రెండు రోజుల క్రితం ప్రసవించిందని కుక్క పిల్లల వద్దకు ఎవరైనా వస్తే వారిపై దాడి చేస్తుందన్నారు. సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే అధికారులతో మాట్లాడి కుక్కను యానిమల్ కేర్ సెంటర్‌ను తరలించామన్నారు. బస్తీలు, కాలనీల్లో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకునేందుకు సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 8న ఉందాసాగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలి ఉన్నట్లు సమాచారం అందింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా 35–40 సంవత్సరాల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. 4–5 రోజుల ముందు సాగర్‌లో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉందని, మృతుడి కోసం స్థానికంగా వాకాబు చేసినా ఎలాంటి సమాచారం అందలేదని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బందిని లేదా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యంతో పారిశుద్ధ్య కార్మికురాలి మృతి


నివాళులర్పిస్తున్న తోటి కార్మికులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో కార్మికురాలిగా పనిచేస్తున్న పుప్పాలగూడ గ్రామానికి చెందిన ఎస్.సబిత(46) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందింది. ఆమె గతంలో గ్రామ పంచాయతీ, ప్రస్తుతం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.21వేల జీతంతో పాటు మరణిస్తే రూ.6లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. అదే పద్ధతిని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

ఇంటి పైనుంచి పడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి

రాజేంద్రనగర్: బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లి మిద్దెపై ఆడుకుంటున్న చిన్నారి ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాతబస్తీకి చెందిన మహ్మద్ ఇబ్రహీంఖాన్ వట్టెపల్లి ఆలీనగర్‌లో ఉండే తన బావమరిది ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి ఈ నెల 1న భార్యాపిల్లలతో కలిసి వచ్చాడు. రాత్రి ఇంట్లో శుభకార్యం జరుగుతుండగా ఇబ్రహీంఖాన్ కుమారుడు రియాజ్‌ఖాన్(4), మరో చిన్నారి ఉన్నీసా నవల్(3) మిద్దె పైకి వెళ్లారు. ఇంటిపై రక్షణ గోడ లేకపోవడంతో వారిద్దరూ కిందపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతున్న చిన్నారి రియాజ్‌ఖాన్ గురువారం సాయంత్రం మృతిచెందాడు. రెండు రోజుల క్రితమే ఉన్నీసా నవల్ ఆరోగ్యం మెరుగుపడడంతో డిశ్చార్జ్ చేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో రియాజ్‌ఖాన్ కోలుకోలేకపోయాడని పోలీసులు వెల్లడించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి


సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్లు

రాజేంద్రనగర్: సంఘ సంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి కార్యక్రమాన్ని జ్యోతిరావు పూలే జయంతోత్సవ కమిటీ అధ్యక్షుడు కె.రఘుగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ పోడుగు అర్చనాజయప్రకాష్, మోండ్ర సంగీతాగౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొలన్ సుభాష్ రెడ్డి, కె.కృష్ణమాచారి, పోతరాజు యాదయ్య, పోరెడ్డి ధర్మారెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, బంగి శ్రీను, డి.సత్యనారాయణముదిరాజ్, రాపోలు సత్తయ్య, కె.రఘు ముదిరాజ్, బి.సిద్దేశ్వర్, సరికొండ వెంకటేష్, ప్రేమ్‌గౌడ్, అంజయ్యగౌడ్, పి.భిక్షపతి, పి.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నివారణ చర్యలపై మాక్ డ్రిల్

శంషాబాద్: అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన ఉండాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డీసీపీ కార్యాలయంలో అగ్నిప్రమాదాల నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జోన్ పరిధిలోని గగన్‌పహడ్, సాతంరాయి, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్, కొందుర్గు పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల నిర్వాహకులు హాజరయ్యారు. పరిశ్రమల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని డీసీపీ సూచించారు. ప్రతి పరిశ్రమలో భద్రతా పరికరాలు అమర్చుకోవాలన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు జరిగే సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ భాస్కర్, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాక్ డ్రిల్ చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన


ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

రాజేంద్రనగర్: కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని రామకృష్ణ హోమియో ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేసిన కార్మికులు కోరుతున్నారు. కాటేదాన్‌లోని పరిశ్రమను మూసి వేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు తెలిపారు. శుక్రవారం పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ తదితర వాటిని చెల్లించాల్సి ఉందన్నారు. నాలుగు సంవత్సరాలుగా పీఎఫ్ పెండింగ్‌లో ఉందని, మూడు నెలల జీతాలు చెల్లించలేదన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.ప్రవీణ్‌కుమార్, సి.శివశంకర్, ఎస్.రమారెడ్డి, ఏ.బాబు, కె.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్పు, సహనం మహిళలకే సాధ్యం


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు ఇతరులకు ఆదర్శం కావాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడాలన్నారు. సీఎం కేసీఆర్ మహిళా పక్షపాతి అని, మహిళా సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచిందని, గతంలో ప్రధాని మోదీ హైదరాబాద్ వచ్చినప్పుడు గ్యాస్ ధరలు తగ్గిస్తామని చెప్పారని, నేడు అమాంతం పెంచి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టుదల, ప్రేమ, నిబద్ధత, ఓపిక మహిళలకే సాధ్యమన్నారు. మాజీ కార్పొరేటర్ సాయిబాబా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహిళలకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులు, ఆశా వర్కర్లను సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.